తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
22 అక్టోబర్ 2026







## జడ్చర్లలో అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

- కన్నుల పండువలా రావణ దహనం.. ఆకట్టుకున్న డ్రోన్ షో
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు

జడ్చర్ల, అక్టోబర్ 21 (జనంసాక్షి): విజయ దశమి (దసరా పండుగ) పురస్కరించుకుని మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బి.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల మైదానంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైదానంలో నిర్వహించిన సాంప్రదాయ రావణ దహనం కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. అలాగే ఆకాశంలో రంగురంగుల ఆకృతులతో సాగిన ప్రత్యేక డ్రోన్ షో విచ్చేసిన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా పండుగ ప్రతీక అని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వేడుకలతో



జడ్చర్ల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## నేడు చేర్యాలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల రాక..



చేర్యాల, అక్టోబర్ 21 (జనంసాక్షి): చేర్యాల రైతు వేదిక వద్ద నేడు గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజె మల్లేశం, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఓ ప్రకటనలో కోరారు.

## నూతన స్కూల్ భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు

- ఘనంగా భూమి పూజ



ఆత్మకూర్, అక్టోబర్ 21 (జనంసాక్షి): ఆత్మకూరు మండలం రేచింతల గ్రామం లో నూతన స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం రూ. 50 లక్షల రూపాయలతో మంజూరు అయిన పాఠశాల భవనానికి కాంగ్రెస్ నాయకులు.మంత్రి వాకిటి శ్రీహరి గారి ఆదేశానుసారం నూతన భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా గారు, మండల పార్టీ అధ్యక్షులు నాగేష్ గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తులసిరాజ్ యాదవ్ గారు, గ్రామ సర్పంచ్ ప్రశాంత్ కిరణ్ కుమార్ గారు, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్ గారు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెగిపోయిన ఎంజే-3 కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- 34 గంటలుగా వృథాగా పోతున్న సాగునీరు..
- రైతుల పంటలకు నష్టం అధికారులు స్పందించకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్

మిగతా 5లో..



వనపర్తి రూరల్, అక్టోబర్ 21 (జనంసాక్షి): వనపర్తి జిల్లా, ఏదులచెన్నారం, రేమద్దుల గ్రామాల శివారులో తెగిపోయిన ఎంజే-3 కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టి సాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్ డిమాండ్ చేశారు. కాల్వ తెగిపోయి 34 గంటలు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెన్నారం, రేమద్దుల గ్రామాల శివారులో తెగిపోయిన ఎంజే-3 కాల్వను సీపీఎం జిల్లా బృందం సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తోందని, మరోవైపు కాల్వ తెగిపోవడంతో విలువైన సాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## పోలీసు సేవలకు మెరుగైన వసతులు..

- వనపర్తి సర్కిల్ కార్యాలయంలో అదనపు గది ప్రారంభం
- ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం: ఎస్పీ డి. సునిత రెడ్డి



మిగతా 5లో..

వనపర్తి, అక్టోబర్ 21(జనంసాక్షి): పోలీసు అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించి, విధుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడమే లక్ష్యంగా పోలీసు శాఖలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి తెలిపారు. బుధవారం వనపర్తి సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు గదిని ఆమె ప్రారంభించారు.

## విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ వినీత్

మిగతా 10లో..



నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 21 (జనంసాక్షి): విధి నిర్వహణలో ప్రజల రక్షణ, దేశ అంతర్గత భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఇతర పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు అమరులయ్యారని

## జూపల్లి సవాల్‌కు సిద్ధం.. పాలమూరు ప్రయోజనాల కోసం చర్చకు రెడీ

- నార్లాపూర్-ఎల్లూరు రిజర్వాయర్ల అనుసంధానం బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయమే
- ప్యాకేజీ-3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగిస్తే నీటి తరలింపునకు అవకాశం
- మూడేళ్లుగా పాలమూరు-రంగారెడ్డి పనులు ఎందుకు నిలిపివేశారు?

మిగతా 5లో..

వనపర్తి రూరల్, అక్టోబర్ 21 (జనంసాక్షి): మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధమని తెలిపారు. పాలమూరు రైతాంగ ప్రయోజనాలే తమకు ముఖ్యమని పేర్కొన్నారు.



నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని తరలించే అనుసంధాన నిర్ణయం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తీసుకున్నామని నిరంజన్‌రెడ్డి వివరించారు. అప్పటి సీఎం కేసీఆర్ అనుమతితోనే తూము ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కేఎల్ఐ కాలువల సామర్థ్యం తక్కువగా ఉండటంతో రైతులకు పూర్తిస్థాయి ప్రయోజనాలు కల్పించేందుకు నార్లాపూర్-ఎల్లూరు, ఏదుల-బుద్దారం, వట్టెం-కల్వకుర్తి కాలువల అనుసంధానానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

### పంపులు నడిపేందుకు అవకాశం...

శ్రీశైలం ప్రాజెక్టులో నీరు అందుబాటులో ఉన్నందున ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే పాలమూరు-రంగారెడ్డి పథకం ద్వారా నీటిని తరలించవచ్చని అన్నారు. ఏదుల, వట్టెం రిజర్వాయర్ల వద్ద పంపులు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన చర్యలు తీసుకుంటే కరివెన వరకు నీటిని తరలించే అవకాశముందని పేర్కొన్నారు. ప్యాకేజీ-3లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగిస్తే నీటి తరలింపు సులభమవుతుందని తెలిపారు.

# నిరంజన్‌రెడ్డి ఇంట దసరా సందడి..



- అభిమానుల అభిమానం ఉప్పెన!

**వనపర్తి రూరల్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో దసరా పండుగ సందడి నెలకొంది. షమీ పూజ అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన ప్రజలతో ఆయన నివాసం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిమానాన్ని చాటుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ నిరంజన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరిస్తూ, పేరు పేరునా మాట్లాడారు. వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో అభిమానులు, పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు.

**అభిమానులకు కొండంత భరోసా..**

రాజకీయ జీవితంలో ఎత్తుపల్లాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగుతూ ప్రజలకు అండగా నిలుస్తున్న నిరంజన్‌రెడ్డిని చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. యువత, పార్టీ కార్యకర్తలు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపించారు. పలువురు పెద్దలు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు అందించగా, మరికొందరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రాంత అభివృద్ధి మరింత ముందుకు సాగేందుకు ఆయన మరోసారి నాయకత్వం వహించాలని పలువురు ఆకాంక్షించారు.

**ప్రజల గుండెల్లోనే అసలైన స్థానం..**

అధికారం ఉన్నా లేకున్నా ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వాములయ్యే నాయకుడికే ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం ఉంటుందని అభిమానులు అభిప్రాయపడ్డారు. నిరంజన్‌రెడ్డి పట్ల ప్రజలు చూపుతున్న అభిమానం, ఆత్మీయత ఆయన నివాసం వద్ద కనిపించిన జనసందోహంతో మరోసారి వెల్లడైందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. రాజకీయాలకు అతీతంగా వివిధ వర్గాల ప్రజలు దసరా పర్వదినాన తరలి వచ్చి శుభాకాంక్షలు తెలపడం, వారందరినీ నిరంజన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అభిమానులు, ఆత్మీయుల రాకతో ఆయన నివాసం రోజంతా సందడిగా మారింది.

## దుర్గాదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ప్రత్యేక పూజలు



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 21(జనంసాక్షి):** శరన్నవరాత్రి దసరా పండుగ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కొరివిపల్లిలో దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హాలావత్ మోహన్ నాయక్, నాయకులు సర్పంచ్ పుల్లారావు, రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదవ రావు, లింగం తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



**పాపన్నపేట, అక్టోబర్ 21 (జనంసాక్షి):** శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికీ రుణపడి ఉంటుందని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో పాపన్నపేట ఠాణా పేలుడు ఘటనలో అసువులు బాసిన ప్రసాద్, రఘునందన్, నర్సింలు, అబెద్ హుస్సేన్, రాంచందర్‌ల చిత్రపటాలకు స్తూపం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఎస్ఐ తుక్కయ్య, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిశిలా క్షేత్రంలో శమీ పూజలు



**మల్దకల్, అక్టోబర్ 21(జనంసాక్షి):** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం విజయదశమి పర్వదినం సందర్భంగా జమ్మి చెట్టు పూజలు నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయంలో ఉదయం పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం దేవాలయంలోని జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి ఆలయ చైర్మన్ శమీ పత్రిని భక్తులకు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపర తిరుపతిగా మల్దకల్ క్షేత్రం నిలిసిల్లడానికి కృషి చేస్తున్నామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో ఇంకా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వచ్చే బ్రహ్మోత్సవాలను దేవర గట్టు వరకు దుకాణాలు, దాసంగాలు నిర్వహించేందుకు ఇప్పుడు రోడ్డు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పట్వారిఅరవిందరావు, చంద్రశేఖరరావు, పట్వారి అనిల్ రావు, బాబురావు, ధీరేంద్ర దాస్, మధుసూదనాచారి, రమేష్ ఆచారి, రవిఆచారి పూజారు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్వతాపురంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- ఆడపడుచులకు రూ.5 వేల నగదు బహుమతి అందజేత
- కులమత భేదాలు లేకుండా ఐకమత్యంతో వేడుకలు నిర్వహించడం అభినందనీయం: సర్పంచ్ కొట్ర ప్రసన్న రాజిరెడ్డి



**తెలకపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మండల పరిధిలోని పర్వతాపురం గ్రామంలో ప్రజలందరూ కలిసి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. కులమత భేదాలు లేకుండా గ్రామస్తులంతా ఐకమత్యంతో వేడుకల్లో పాల్గొని పండుగ శోభను చాటారు. బుధవారం బతుకమ్మ సంబరాలు ముగిసిన సందర్భంగా ఆడపడుచులను ప్రోత్సహించేందుకు గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి చిన్న కుమారుడు పవన్ కుమార్ రెడ్డి రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ బహుమతిని గ్రామ సర్పంచ్ కుట్ర ప్రసన్న రాజిరెడ్డి చేతుల మీదుగా ఆడపడుచులకు అందించారు. గ్రామంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఇదే స్ఫూర్తితో కులమతాలకు అతీతంగా అందరూ కలిసి వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఆడపడుచులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతి అందజేసిన పవన్ కుమార్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బహుమతి దాత పవన్ కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ఆడపడుచులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**చేర్యాల, అక్టోబర్ 21 (జనంసాక్షి):** చేర్యాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పోలీసులు ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సై అపూర్వరెడ్డి మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర





**తూప్రాన్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మెదక్ జిల్లా తూప్రాన్‌లో దుర్గాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి శోభాయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహంకాళి దేవాలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి హల్దీ వాగు వద్దకు చేరుకుంది. భజనలు, భక్తిగీతాలు, డీజే నినాదాలు, యువత నృత్యాలతో పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హల్దీ వాగులో అమ్మవారి విగ్రహాన్ని సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేయడంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల కృష్ణ ముదిరాజ్, కమిషనర్ రమేష్ కుమార్, వెంకట గోపాలకృష్ణ, డాక్టర్ జానకిరామ్, విద్యాసాగర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మలుపు వద్ద అదుపుతప్పి కిందపడిన ద్విచక్రవాహనదారుడు**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూరు మండలం తుమ్మన పేట గ్రామానికి చెందిన బతికే మల్లేష్ అలియాస్ మల్లయ్య (41) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో డిండి గ్రామం నుంచి బొమ్మనపల్లి గ్రామానికి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గువ్వలోనిపల్లి గ్రామం దాటిన అనంతరం పెనిమిళ్ల గ్రామ శివారులోని బీటీ రోడ్డుపై మలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లేష్ తలకు, కుడి కణత భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బతికే మనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పునుంతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## చెట్టును ఢీకొని పల్టీలు కొట్టిన కారు.. యువకుడు మృతి



**మల్దకల్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లిలో ఈ నెల 19న అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాశపోగు సుమంత్ (25) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సుమంత్ మరో ఇద్దరితో కలిసి బెలెనో కారులో వెళ్తుండగా, గోపాల్‌రెడ్డి కిరాణా దుకాణం సమీపంలో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని రెండుసార్లు పల్టీలు కొట్టింది. తీవ్రంగా గాయపడిన సుమంత్‌ను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమంత్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు.

# గుండారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లపై రాజకీయ రగడ!

## గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అభివృద్ధి వివరాలు వెల్లడించాలి: కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి

**కోహెడ, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని గుండారెడ్డిపల్లిలో గ్రామసభ పేరుతో ఇందిరమ్మ ఇళ్ల అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాప రాజిరెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, గత పదేళ్లలో బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాం లో గ్రామానికి వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, వైద్య సహాయం కోసం ఎల్ఓసీలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు, రహదారుల అభివృద్ధి వంటి పథకాల ద్వారా ప్రయోజనం కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గుండారెడ్డిపల్లి గ్రామానికి ఎంత అభివృద్ధి జరిగింది.

అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హయాంలో గ్రామానికి ఎన్ని ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. 14వ, 15వ ఆర్థిక సంఘాల ద్వారా వచ్చిన నిధులు ఎంత గ్రామపంచాయతీకి వచ్చిన ఇతర నిధులు ఎన్ని అలాగే వాటితో చేపట్టిన పనులు, చేసిన ఖర్చుల వివరాలను వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జాప రాజిరెడ్డి ప్రశ్నించారు.



ప్రభుత్వ పథకాలపై రాజకీయాలు చేయడం కంటే గ్రామానికి వచ్చిన నిధులు, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవాలతో చర్చించడం ముఖ్యమని అన్నారు. గ్రామసభలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని, రాజకీయ విమర్శలకు పరిమితం కాకూడదని సూచించారు. అన్ని పార్టీల నాయకులు గ్రామాభివృద్ధికి సహకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన పేదలకు న్యాయం జరగాలని ఆయన ప్రశ్నించారు.

## మెటల్‌కుంటలో అంబురానంటిన బోనాల సంబరాలు





**న్యాల్‌కల్, అక్టోబర్ 21(జనంసాక్షి):** మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో బోనాల సంబరాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఆవరణలో సోమవారం సాయంత్రం బోనాల వేడుకను అతి భారీగా చేపట్టారు. గ్రామానికి చెందిన భవాని మాత నవరాత్రి ఉత్సవాల భక్తమండలి, గ్రామానికి చెందిన పలువురు ప్రముఖుల సమక్షంలో.. భవాని మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. బోనాల ఊరేగింపు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఘనంగా జరుపుకున్నారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు, చిన్నారి బాలికలు ఆట, పాటలతో సందడి చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కోలాట, డీజే చప్పుళ్ళతో బోనాలను చేతపట్టుకొని ఆడిపాడారు. వందలాదిగా వచ్చిన మహిళలు, స్థానిక ప్రజానీకంతో.. ఆలయ ఆవరణ వందలాది భక్తజనంతో కటకటలాడింది. ప్రతి ఏటా భవాని మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. చివరి రోజు బోనాల ఊరేగింపును అత్యంత ఘనంగా చేపడతారు.

## బైక్ అదుపుతప్పి యువకుడు మృతి...

**చిలప్ చేడ్, 21అక్టోబర్ (జనంసాక్షి):** మండల పరిధిలోని గుజిరి తాండ గ్రామపంచాయతీ సమీపంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌతాపూర్ దగ్గర మంగళవారం నాడు రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు చిలప్ చేడ్ ఎస్సై నరసింహులు తెలిపారు. వివరాల్లోకి వెళితే హత్నూర మండలం పీర్ల తాండ (దేవుని గుట్ట తండా) గ్రామానికి చెందిన యువకులు రాహుల్(22), ధనరాజ్ ఇద్దరు కలిసి బైక్ పై చిలప్ చేడ్ మండలంలోని గౌతాపూర్ గ్రామానికి వెళుతుండగా సుమారు రాత్రి 10:30 గంటల సమయంలో గౌతాపూర్ హై స్కూల్ దగ్గర అతివేగంతో బైక్ నడుపుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టి రాహుల్ అక్కడికక్కడే మృతి చెందాడు, ధనరాజ్ తీవ్రగాయాలతో జోగిపేట ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మల్లారెడ్డి హాస్పిటల్ కు తరలించినట్లు తెలిపారు. రాహుల్ భౌతికకాయనికి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి నందు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని మృతుడి తండ్రి లక్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా వెల్లడించారు.



## శ్యామ్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఉర్కొండ మండలం తిమ్మన్నపల్లి గ్రామానికి చెందిన భాష మోని శ్యామ్ కుటుంబానికి పలువురు దాతలు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ద్యాప పవన్ కుమార్ రెడ్డి తన మిత్రులతో కలిసి రూ.30 వేలు, ప్రజావెలుగు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకగాళ్ల పవన్ కుమార్ రూ.20 వేలు అందించారు. శ్యామ్ నలుగురు కుమార్తెల చదువుకు సహకరిస్తామని, భార్య శివలీలకు ఉపాధి కల్పించేందుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



## తల్లునూరు గ్రామంలో

# దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

- వీరశివాజీ యూత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**రేవల్లి, అక్టోబర్ 20 (జనంసాక్షి):** రేవల్లి మండలం తల్లునూర్ గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో గ్రామస్తులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి దుర్గామాతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆటపాటలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలతో ఉత్సవాలు కోలాహలంగా సాగాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు భారీ ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తుల జయజయధ్వానాలతో గ్రామం మొత్తం భక్తిమయంగా మారింది. ఈ కార్యక్రమంలో వీర శివాజీ యూత్ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ యువకులు, పెద్దలు మహిళలు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దసరా సందర్భంగా

# వీపనగండ్లలో తగ్ ఆఫ్ వార్ పోటీలు



**వీపనగండ్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** దసరా పండుగ సందర్భంగా వీపనగండ్ల మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో తగ్ ఆఫ్ వార్ (తాడు లాగుడు) పోటీలు నిర్వహించారు. వనపర్తి జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో పది జట్లు పాల్గొన్నాయి.

ఆదర్శ కాలనీ టీం మొదటి బహుమతి, వాకింగ్ టీం రెండో బహుమతి, మునికొండ శీను టీం మూడో బహుమతి సాధించాయి. కార్యక్రమానికి సహకరించిన దాతలను శాలువాలతో సన్మానించారు. పోటీల నిర్వహణకు కృషి చేసిన మధుని ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధుగని బాల పీరు, కాంగ్రెస్ నాయకులు సమ్మిరెడ్డి రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## పోలీసు అమరుల సేవలు మరవరానివి



**తూప్రాన్, అక్టోబర్ 21(జనంసాక్షి):** పోలీసుల అమరుల సేవలు మరువరానివని తూప్రాన్ సీఐ వెంకట్రాజ గౌడ్ తెలిపారు. తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో డిఎస్పి బాలసుబ్రమణ్యం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సందర్భంగా మాట్లాడారు ప్రజల కోసం ప్రజా శ్రేయస్సు కోసం పోలీసులు ప్రాణాలు త్యాగం చేశారని వారి సేవలు మరువరాని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ2 యాదగిరి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దసరా వేడుకలు...



**పెద్దశంకరంపేట్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెద్ద శంకరంపేటలో పట్టణ పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి దుర్గమ్మ దేవాలయం వద్ద షమీ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామాలయంలో భక్తులు ప్రజలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ప్రజలు ఒకరికి ఒకరు ఆలింగణం చేసుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఘనంగా విజయదశమి ఉత్సవాలు



**ఆత్మకూర్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** ఆత్మకూరు పట్టణంలోని పరమేశ్వర స్వామి జాతర మైదానంలో మంగళవారం విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విజయలక్ష్మి ఉత్సవాల సందర్భంగా శమీ చెట్టుకు ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా పరమేశ్వర స్వామి జాతర మైదానంలో గ్రామ ప్రజలు, మహిళలు, పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శమీ పూజ అనంతరం రావణాసురుని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, మార్కెట్ చైర్మన్ రహమతుల్లా, మండల అధ్యక్షుడు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు ఇర్లదిన్నె శ్రీనివాసులు , మహేష్,వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు,

## నాగం తిరుపతి రెడ్డి మాతృమూర్తికి నిరంజన్‌రెడ్డి దంపతుల నివాళులు



**రేవల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** నాగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం తిరుపతి రెడ్డి మాతృమూర్తి నాగం సుబ్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వాసంతి బుధవారం నాగపూర్‌లోని ఆమె స్వగృహానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిరంజన్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడె మోసి తన సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కలగాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# రావణ దహనంలో రాజుకున్న రగడ

- దళిత,హిందూ వర్గాల మధ్య బాహాబాహీ
- రామున్ని అవమానించారంటూ హిందువులు
- కులం పేరుతో కించపరిచారని దళితులు
- కయ్యానికి కాలు దువ్విన ఇరు వర్గాలు
- ఉద్రిక్తంగా మారిన వివాదం
- రంగంలోకి దిగిన జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి



**హత్నూర, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రమైన హత్నూరలో దళిత, హిందూ వర్గాల మధ్య ముదిరిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. నువ్వా..నేనా అంటూ కయ్యానికి కాలు దువ్వడంతో ఒక్కసారిగా అక్కడ ఘర్షణా వాతావర ణం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసులను మోహరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రావణ దహనం వేడుకలో చోటు చేసుకున్న వివాదం తీవ్రరూపం దాల్చింది.

రావణ దహనం వేడుకలో పాల్గొనవలిసిందిగా గ్రామ సర్పంచి ఎల్లయ్యను ఆహ్వానించగా తాను అయిష్టత వ్యక్తం చేయడంతో పాటు శ్రీరాముడిని అవమానపరిచేలా వ్యాఖ్యానించారని హిందూ వర్గం వారు ఓ వైపు ఆరోపణలు చేయగా.. ఓ దళితుడు సర్పంచిగా ఉండటంపై అయిష్టత వ్యక్తం చేస్తూ,కులం పేరుతో దూషించి కించపరిచేలా వ్యవహరించారని దళిత వర్గం వారు మరోవైపు ప్రత్యారోపణలకు దిగారు. ఇరు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి కయ్యానికి కాలు దువ్వారు.

నువ్వా నేనా అంటూ బాహాబాహీకి దిగారు. ఒక్కసారిగా గ్రామంలో కమ్ముకున్న భయానక వాతావరణం, పోలీసుల మోహరింపుతో ప్రజల్లో తీవ్ర భయాందోళన వ్యక్తమైంది. శ్రీరాముడినే గాకుండా, భవానీ మాత దీక్షాపరులను అవమానించేలా వ్యాఖ్యానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ వర్గం వారు నిరసన తెలుపగా,కులం పేరుతో దూషించి, అవమానించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దళిత వర్గం వారు ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.

పరిస్థితిని చక్కదిద్దేందుకు భారీగా పోలీసులను మోహరించారు.

ఈ సందర్భంగా ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి శాంతింపజేయడంతో వివాదం సద్దుమణిగింది.

# మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్యగౌడ్‌కు సన్మానం



**చేర్యాల, అక్టోబర్ 21 (జనంసాక్షి):** చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పచ్చిమడ్ల వెంకటయ్య గౌడ్ ఇటీవల నియామకం కాగా వారిని చేర్యాల మండల కేంద్రంలోని బుధవారం పాత బస్టాండ్ వద్ద ఓ హాల్ లో పద్మశాలి సంఘం సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉండి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, పద్మశాలి సంఘం నాయకులు దూడం వెంకటేశం, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తడక లింగమూర్తి, నాగుల వెంకటేశం, గోనే లక్ష్మీనారాయణ, ఆడెపు కనకయ్య, తౌట రవీందర్, ఇప్పకాయల సంజీవులు, కాటం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా బోనగిరి ప్రశాంత్ ఏకగ్రీవ ఎన్నిక



**బెజ్జంకి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బోనగిరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా బోనగిరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి శంకరయ్య, కార్యదర్శిగా నల్లగొండ రత్నాకర్, కోశాధికారిగా బోనగిరి శ్రీనివాస్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బోనగిరి ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మృతుని కుటుంబానికి ఆర్థికసాయం చేసిన మాజీ జెడ్పిటిసి ప్రశాంత్ అశ్విని

**కొండపాక, అక్టోబర్ 21(జనంసాక్షి):** కొండపాక మండలంమర్పడగ గ్రామానికి చెందిన చెందిన బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బైరీ బాలయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కొండపాక మండలం మాజీ జెడ్పిటిసి అనంతుల అశ్విని ప్రశాంత్ మృతుని కుటుంబానికి 5000/_ రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అనంతల ప్రశాంత్ మాట్లాడుతూ కార్యకర్తల ద్వారా సహాయం అందజేయడం జరిగిందని అనంతల ప్రశాంత్ అశ్విని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ



**కౌడిపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** విజయదశమి సందర్భంగా కౌడిపల్లిలో శ్రీకరి జువెలర్స్ అండ్ పాన్ బ్రోకర్స్ ప్రొప్రైటర్ నాగరాజు చారి సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ చేతుల మీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగలు జరుపుకోవాలని, గ్రామ సేవలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని అన్నారు. నాగరాజు చారి సామాజిక సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేతా గౌడ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులకు ఘన నివాళులు
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయి: కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు జంగయ్య (సిర్గాపూర్), ఎల్లయ్య (సంగారెడ్డి పట్టణం), సత్యనారాయణ (జిన్నారం), సురేష్ (కంగ్టి) చేసిన త్యాగాలను కొనియాడారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసుల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని, వారిలో తెలంగాణకు చెందిన నలుగురు ఉన్నారని పేర్కొన్నారు.






నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో తెలంగాణలో పలువురు పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రతకు అంకితభావంతో పనిచేయాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు.

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్ర గాయాలు

- ఫీడర్ ఆన్ చేయడంలో పొరపాటే ప్రమాదానికి కారణమని గ్రామస్థుల ఆరోపణ

**నంగునూరు, అక్టోబర్ 21 (జనంసాక్షి):** సిద్ధన్నపేటలో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో హెల్పర్ వస్తాదుల లక్ష్మయ్య షాక్‌కు గురై కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు వెంటనే సిద్ధిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మయ్య చికిత్స పొందుతున్నాడు.

**వివరాల్లోకి వెళ్తే..** నంగునూరు విద్యుత్ ఉపకేంద్రం నుంచి సిద్ధన్నపేట ఫీడర్‌కు లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకున్న లక్ష్మయ్య, గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టాడు. ఈ సమయంలో విద్యుత్ ఉపకేంద్రంలో ఫీడర్ నిర్వహణలో జరిగిన పొరపాటు కారణంగా సిద్ధన్నపేట ఫీడర్‌కు విద్యుత్ సరఫరా అయినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో స్తంభంపై పనిచేస్తున్న లక్ష్మయ్య షాక్‌కు గురై కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం.

**భద్రతా చర్యలు తప్పనిసరి...**

విద్యుత్ ఫీడర్ ఆన్ చేసే సమయంలో జరిగిన పొరపాటే ప్రమాదానికి కారణమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఎల్‌సీ తీసుకున్న ఫీడర్‌ను నిలిపివేయకుండా విద్యుత్ సరఫరా చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. అయితే ప్రమాదానికి గల కారణాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.





విద్యుత్ సిబ్బంది భద్రత విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులు కోరుతున్నారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం, ఫీడర్ నిర్వహణలో సమన్వయం పాటించడం, భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ప్రమాదానికి కారణాలను గుర్తించాలని, నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మయ్య త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.

# ఈదమ్మ గడ్డ తండాలో ఘనంగా దసరా సంబరాలు!

## గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి!



**బాలానగర్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** బాలానగర్ మండలంలోని ఈదమ్మ గడ్డ తండాలో దసరా పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తండాలో గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో చేసిన సాంస్కృతిక నృత్యాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా పాల్గొని వారితో కలిసి ఆడిపాడారు. గిరిజనులతో ఆత్మీయంగా మమేకమై వారి ఆనందోత్సాహాల్లో పాలుపంచుకున్నారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు తండా అంతా పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో బాలానగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, ఈదమ్మ గడ్డ తండా నాయకులు, మహిళలు, తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ వెలుగులకు మరో అడుగు..

- **గోపాలపేటలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**



**గోపాలపేట, అక్టోబర్ 21 (జనం సాక్షి):** ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో గోపాల పేటలో ఏర్పాటు చేసిన నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ కర్రోళ్ళ స్వప్న భాస్కర్ ప్రారంభించారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడి, లో-వోల్టేజీ సమస్యలకు కొంత మేర పరిష్కారం లభించనుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి తో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి. కేశవులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజుతో పాటు పోతురాజు గోపాల్, ఎంగరిగల్ల బాల చంద్రయ్య, పెద్ద వెంకన్న, దాసరి ఉష, గంధం నాగరాజు, ధన్వాడ జ్యోతి, వేపచెట్టు భాగ్యమ్మ, మన్యం నాయక్, వల్లెపు మూర్తి, శనగల వెంకటయ్య, నాగరాజు గౌడ్, వేపచెట్టు ఓంకారం, కుమ్మరి నాగన్న, కుమ్మరి శంకర్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా ఘనంగా దసరా వేడుకలు





- **ఆనందోత్సాహాలతో ప్రజల అలయ్ బాలయ్**

**చేర్యాల, అక్టోబర్ 21 (జనంసాక్షి):** శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవిని వివిధ అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నవరాత్రి ఉత్సవాల చివరి రోజున మంగళవారం సంప్రదాయ బద్ధంగా వస్తున్న ఆచారంలో భాగంగా గ్రామాలలో గ్రామ పెద్దలు పురవీధుల గుండా ఊరేగింపుగా వచ్చి గ్రామ ఖచ్చీరు, బొడ్రాయి చౌరస్తాల వద్ద ఆయుధ బలిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికంగా ఉన్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జమ్మి పూజ నిర్వహించి స్నేహితులు, బంధు మిత్రులకు జమ్మి పెట్టి అలయ్ బాలయ్ తీసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రశాంతంగా ఆనందోత్సాహాలతో పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

# ఆత్మకూర్‌లో ఘనంగా ముగిసిన KPL క్రికెట్ టోర్నీ



**ఆత్మకూర్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ 1వ వార్డు (ఖానాపూర్) లో విజయదశమి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ (KPL) ఘనంగా ముగిసింది. మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు మరియు 1వ వార్డు కౌన్సిలర్ కోట్ల తిరుపతి సహాయ సహకారాలతో, సందిగల్ల అరుణ్ క్రికెట్ కిట్ అందజేయడంతో మూడు రోజుల క్రితం ఈ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నీలో మొత్తం 5 జట్లు తలపడగా, ఫైనల్ లో లగాన్స్ టీం విజేతగా నిలిచింది. గెలిచిన జట్టుకు అక్షర స్కూల్ మహేష్ మరియు వార్డు కౌన్సిలర్ తిరుపతి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విజేతకు మరియు రన్నరప్ కు రూ. 15 వేల ప్రైజ్ మనీని కౌన్సిలర్ కోట్ల తిరుపతి అందజేశారు. అక్షర స్కూల్ మహేష్ మాట్లాడుతూ ఆటలు మానసికంగా, శారీరకంగా దృఢ సంకల్పాన్ని ఇస్తాయని, ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని అన్నారు. కౌన్సిలర్ కోట్ల తిరుపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే టోర్నమెంట్ నిర్వహిస్తామని, తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ సద్దల తులసి వెంకటరాములు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ కోట్ల తిరుపతయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీకాంత్, కావలి రవి, అంపైర్ కర్ణాకర్, నిర్వాహకులు అంబేద్కర్, శివశంకర్ గౌడ్, తోట్ల చెన్నయ్య, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల జిల్లా అగ్రహారంలో తప్పిన పెను ముప్పు

- **కృష్ణా నదిలోకి దూసుకెళ్లిన కియా కారు**



**గద్వాల జిల్లా, అక్టోబర్ 22(జనంసాక్షి):** గద్వాల జిల్లా అగ్రహారం వద్ద కృష్ణా నది ఒడ్డున బుధవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. పూజా కార్యక్రమాలతో రద్దీగా ఉన్న నది ఒడ్డున ఓ కియా కారు అదుపుతప్పి నేరుగా నదిలోకి దూసుకెళ్లడంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. బుధవారం ఉదయం నుంచి అగ్రహారం పుష్కర ఘాట్ వద్ద భక్తులు పూజలు, పిండ ప్రదానాలు చేస్తున్నారు. ఘాట్ పైభాగంలో పార్క్ చేసి ఉన్న కియా కారు ఒక్కసారిగా వెనక్కి జారి వేగంగా నదిలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు, అక్కడే పూజలు చేస్తున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కారు దూసుకొస్తుండటం గమనించిన స్థానికులు కేకలు వేస్తూ పక్కకు పరుగులు తీయడంతో పెద్ద ప్రాణనష్టం తప్పింది. అయితే ఈ హడావిడిలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో కారును నదిలో నుంచి బయటకు లాగేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాల పై పోలీసులు విచారణ చేపట్టారు. హ్యాండ్ బ్రేక్ వేయక పోవడం వల్లే కారు జారిందా, లేక సాంకేతిక లోపమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నది ఒడ్డున ఎలాంటి భద్రతా చర్యలు, బారికేడ్లు లేకపోవడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

- **అన్నదానం నిర్వహించిన ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శ్రీనివాస్**





**రాయికోడు, అక్టోబర్ 21 (జనం సాక్షి):** మండల పరిధిలోని జంబిగికే గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ దుర్గామాత అమ్మవారి నిమజ్జనోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సంజీవ్ జోషి, నీలకంఠయ్య స్వామిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు, కోలాటం ఆటలు, నిర్వహిస్తూ యువకులు భాజా భజంత్రీలతో నృత్యాలు చేస్తూ ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనోత్సవం గావించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అమ్మవారి సన్నిధిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్, ఉపసర్పంచ్ రాజేశ్వరి నర్సింలు, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు వెంకటరెడ్డి, శ్రీశైలం ఒగ్గు విట్టామ్మ, రాధాకృష్ణ మెమోరియల్ పాఠశాల కరస్పాండెంట్, కె.పాండు, నాయకులు రత్నారెడ్డి, సంగారెడ్డి, టీ శ్రీకాంత్, విట్టల్ రెడ్డి, నిర్వాహకులు ఒగ్గు రమేష్, విక్రమ్, గాలయ్యస్వామి, కే అశోక్, పలువురు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెగిపోయిన ఎంజే-3 కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

కాల్వకు గండి పడి గంటలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథాగా పోవడమే కాకుండా రైతుల పంటలకు నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు ఎంతో కీలకమైన సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.

జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తెగిపోయిన కాల్వకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సాగునీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేయడంతో పాటు రైతుల పంటలకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి. వెంకటయ్య, రేమద్దుల గ్రామ సర్పంచ్ నిరంజన్, సీపీఎం నాయకులు భగత్ ఖాజా, భాస్కర్ గౌడ్, చెన్నారం సీపీఎం నాయకుడు కోడిగంటి రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జూపల్లి సవాల్‌కు సిద్ధం.. పాలమూరు ప్రయోజనాల కోసం చర్చకు రెడీ

## మూడేళ్లుగా పనులు ఎందుకు నిలిపివేశారు?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులు ఎందుకు నిలిచిపోయాయని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన కాలువల నిర్మాణ టెండర్లను ఎందుకు రద్దు చేశారని, కొత్త టెండర్లను ఎందుకు పిలవలేదని నిలదీశారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా రైతులకు సాగునీరు అందించే పనులను వేగవంతం చేయాలని కోరారు. అవసరమైన నిధులు విడుదల చేసి పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు.

# పోలీసు సేవలకు మెరుగైన వసతులు..

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ విధులను సౌకర్యవంతంగా నిర్వహించేందుకు ఈ అదనపు గదిని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం అనంతరం కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ, సిబ్బందికి అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..** పోలీసు కార్యాలయాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు విధుల నిర్వహణలో సమన్వయం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవాభావం ఎంతో ముఖ్యమని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, జిల్లా ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గౌతాపూర్‌లో ఘనంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర!

## భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల నవరాత్రి ఉత్సవాలకు ముగింపు!







**బాలానగర్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** బాలానగర్ మండలంలోని గౌతాపూర్ గ్రామంలో శ్రీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని తొమ్మిది అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు మహిళమణులు మంగళహారతులు దేవికి దూప దీప నైవేద్యం సమర్పించి అనంతరం ఉత్సవాలను ఘనంగా ముగించారు.

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ధరించిన చీరలను వేలం వేయగా భక్తులు పోటీపడి వేలం పాటల్లో పాల్గొన్నారు. అలాగే తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న కలశాన్ని సైతం వేలం వేయగా భక్తులు భక్తిశ్రద్ధలతో దక్కించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తి గీతాలు, కోలాటాలు, ఆటపాటల మధ్య గ్రామంలో అమ్మవారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొని అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం కోసం విజయవాడకు తరలించారు.

**చీరల వేలంలో పలికిన ధరలు...**

1వ రోజు చీర – రూ.7,100 – శ్రీ వెంకటేష్ చారి
2వ రోజు చీర – రూ.5,500 – శ్రీ అలకుంట నవీన్
3వ రోజు చీర – రూ.5,200 – శ్రీ దాసరి మల్లేష్
4వ రోజు చీర – రూ.7,700 – శ్రీ ప్రశాంత్ వాల్మీకి
5వ రోజు చీర – రూ.9,200 – శ్రీమతి పెద్దోని హంసమ్మ
6వ రోజు చీర – రూ.24,300 – శ్రీ అనేమోని అంజయ్య
7వ రోజు చీర – రూ.40,100 – శ్రీనివాస్ యాదవ్
8వ రోజు చీర – రూ.25,000 – శ్రీ బుడ్డయ్య యాదవ్
9వ రోజు చీర – రూ.22,200 – శ్రీ ప్రశాంత్ వాల్మీకి
తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న కలశం – రూ.12,500 – శ్రీ అంజయ్య యాదవ్

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్ల ప్రకాష్ గౌడ్, ఉప సర్పంచ్ పెద్దోని యాదయ్య, వార్డు సభ్యులు, గత తొమ్మిది రోజులుగా అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి చీరల వేలం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిమజ్జన శోభాయాత్రను విజయవంతం చేశారు.





## తుక్కాపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే భరోసా

- గ్రామ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ ఆంజనేయులు వినతి

**కొల్చారం, అక్టోబర్ 22 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు తెలిపారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. తుక్కాపూర్ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ వెల్లడించారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ ఆరె రవీందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో భవానీ మాత విగ్రహ నిమజ్జనం



**సిర్గాపూర్, అక్టోబర్ 21(జనంసాక్షి):** సిర్గాపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో భవానీ మాత నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారికి వీడ్కోలు పలుకుతూ భక్తి భావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ శోభాయాత్ర



**కొల్చారం, అక్టోబర్ 21(జనంసాక్షి):** కొల్చారం మండల కేంద్రంలో దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ రూపాల్లో భక్తులు అమ్మవారిని నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజించారు బుధవారం అమ్మవారి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య శోభాయాత్ర భక్తిమయ వాతావరణంలో సాగింది. అమ్మవారి ఆశీస్సులతో మండల గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దుర్గ భవాని కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. జూలకంటి సంగమేశ్వర్, పాల్వంచ రామకృష్ణ గౌడ్ ,అశోక్ గౌడ్, వనమాల శ్రీధర్, వనమాల అనిల్ కుమార్, అంజనీ పుత్ర, శ్రీధర్ గౌడ్, శివకుమార్ గౌడ్, పాంద్ర వెంకటేశం, పాంద్ర శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ నాగూరి మనోహర్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిజెపికి మైనార్టీల మద్దతు మరింత కూడగట్టాలి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్



**నారాయణపేట అక్టోబర్ 21(జనంసాక్షి):** రాష్ట్రంలో బిజెపికి మైనార్టీల మద్దతు మరింత కూడగట్టాలని బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పండు రెడ్డి మైనార్టీ నాయ కులకు పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహమ్మ ద్ జావిద్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జమీర్‌పాషా సన్మానించారు. ఈ సందర్భంగా రతంగ్ పాండు రెడ్డి మాట్లాడుతు ప్రధాని నరేంద్రమోడీ సంక్షేమ పథకాల వల్ల మైనార్టీలకు అన్ని సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు.దాంతో దినదినానికి మైనా ర్టీలు బిజెపి కి దగ్గర అవుతున్నారని అన్నారు.దాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాలో మరింత పట్టు సాధించాలనిసూచించారు.కార్యక్రమంలో రాష్ట్ర మైనా ర్టీ మోర్చా ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ, మాజీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతి



**కొత్తపల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** కొత్తపల్లి గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో చోటుచేసుకుంది.

కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలుడు స్థానికంగా మూడో తరగతి చదువుతున్నాడు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు జారిపడి చెరువులో మునిగి మృతి చెందాడు. బాలుడి తండ్రి మున్నూరు చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## భక్తిశ్రద్ధలతో దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర

- తొమ్మిది రోజులపాటు వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



**కొల్చారం, అక్టోబర్ 21 (జనంసాక్షి):** కొల్చారం మండలవ్యాప్తంగా దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు.

ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శోభాయాత్ర భక్తిమయ వాతావరణంలో కొనసాగింది.

దుర్గాభవాని అమ్మవారి కృపాకటాక్షాలతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రతో మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఈ కార్యక్రమంలో దుర్గాభవాని కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గౌరీదేవిపల్లిలో 500 మందికి చీరల పంపిణీ



**రేవల్లి, అక్టోబర్ 20 (జనంసాక్షి):** రేవల్లి మండల పరిధిలోని గౌరీదేవిపల్లి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, సింగిరెడ్డి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని 500 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలకు చీరలతో పాటు పండుగ కానుకలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య, రామకృష్ణ, మాసయ్య, బొందయ్య, మాధవ్, మల్లేష్‌తో పాటు గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమరచింత అభివృద్ధికి కృషి చేయాలని వినతి



**అమరచింత, అక్టోబర్ 21 (జనంసాక్షి):** బీజేపీ పంజాబ్, హర్యానా, చండీగఢ్ రాష్ట్రాల సంఘటన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్‌కు అమరచింత డెవలప్‌మెంట్ ఫోరమ్ నాయకులు దసరా శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందించారు. అమరచింత అభివృద్ధితోపాటు నియోజకవర్గ సాధనకు కృషి చేయాలని కోరారు. మండల కేంద్రంలో నవోదయ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, కార్మిక ఆసుపత్రి, పోస్టాఫీసుకు భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరమ్ నాయకులు పాల్గొన్నారు.

## సదాశివపేట పోలీస్ కార్యాలయంలో ఆయుధపూజ..



**సదాశివపేట, అక్టోబర్ 21(జనంసాక్షి):** సదాశివపేట పోలీస్ కార్యాలయంలో దసరా పండుగ సందర్భంగా ఆయుధ పూజా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కార్యాలయంలో పోలీసులు వినియోగించే ఆయుధాలుకు, వాహనాలకు పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు, పోలీస్ కుటుంబాలు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య



**రాయికోడు, అక్టోబర్ 21, (జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయి కోడుతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో విజయదశమి వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. సాంప్రదాయ బద్ధంగా ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలను ధరించి పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో భాజా భజంత్రీలతో ఆటా పాటలతో నృత్యాలు చేస్తూ జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నాగ్వర్ గ్రామంలో నిర్వహించిన విజయదశమి వేడుకల పూజా కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చాలి



**మక్తల్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరికి సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చినప్పుడే పండుగ సాయన్నకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. గురువారం రవీంద్రభారతిలో జరిగే సభలో పెండింగ్‌లో ఉన్న బీసీ-ఏ ఫైల్‌పై సీఎం సంతకం చేసి ముదిరాజులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జయంతి వేడుకలకే పరిమితం కాకుండా, ముదిరాజుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

## వైభవంగా శ్రీ బంగారు మైసమ్మ నవరాత్రి ఉత్సవాలు



**జడ్చర్ల, అక్టోబర్ 21 (జనంసాక్షి):** కావేరమ్మపేటలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన దాతలకు, భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు గోనెల నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. అన్నదానం, విశేష పూజలకు సహకరించిన వారిని అభినందిస్తూ, బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# కల్వకుర్తిలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం



- కోలాటంతో అదరగొట్టిన మహిళలు

**కల్వకుర్తి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** కల్వకుర్తి మండల కేంద్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కల్వకుర్తి గ్రామంలో జై దుర్గ భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి గత 9 రోజులుగా ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల చివరి రోజు సందర్భంగా బుధవారం సాయంత్రం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మంగళ వాయిద్యాలు, డీజే సౌండ్, డప్పుచప్పుళ్ల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు.

**మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణ...**

ఈ ఊరేగింపులో మహిళలు, చిన్నారులు వేసిన కోలాట నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేతిలో కోలాట కర్రలతో లయబద్ధంగా ఆడుతూ, అమ్మవారి పాటలు పాడుతూ గ్రామస్తులను అలరించారు. ఫోటోలో కనిపిస్తున్నట్లు దాదాపు 100 మందికి పైగా మహిళలు ఈ కోలాటంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక చెరువు వద్ద అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం



చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

## సింగంపేటలో క్రైస్తవ కుటుంబ ఆశీర్వాద కూడికలు



**అమరచింత, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మండల పరిధిలోని సింగంపేట గ్రామంలో యం.బి.నజరేతు సంఘం చర్చి ఆవరణంలో నిర్వహించనున్న క్రైస్తవ కుటుంబ ఆశీర్వాద కూడికలు బుధవారము గురువారం రెండు రోజులు 21.22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘ పాస్టర్ నరేష్ కుమార్ ఒక ప్రకటనలు తెలిపారు. దేవుని వాక్యం ప్రసంగికులు హోలీ బైబిల్ ఫెలోషిప్ మిరాసీపల్లి పాస్టర్ ఇమ్మానియేల్ అదేవిధంగా ఆమెన్ ప్రార్థన మందిరం బేరయ బైబిల్ కాలేజ్ కర్నూల్ పాస్టర్ య శి.నాగరాజు ప్రసంగించనున్నారు. ఈ యొక్క కుటుంబ ఆశీర్వాద కూడికలకు ఆయా గ్రామాల నుండి వచ్చిన విశ్వాసులు అధికంగా పాల్గొంటారని తెలిపారు. కుటుంబ ఆశీర్వాద కూడికలు వచ్చిన అందరూ కి మనవి చేస్తున్నాశీ..ఈ కార్యక్రమాన్ని యం.బి. నజరేతు సంఘము ఆశీస్సులు పెద్దలకి ప్రతి ఒక్కరూ పాల్గొని కుటుంబ సభ్యులు అందరి ఆశీర్వాదం పొందగలరని మనవి.

## సర్టిఫికెట్లలో వ్యత్యాసాలు

- విద్యార్థుల భవిష్యత్తుకు ముప్పు
- విశ్రాంత పి.ఇ.టి బి. గోపాలం



**మక్తల్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** పాఠశాల రికార్డులు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల్లో విద్యార్థుల పుట్టిన తేదీలు వేర్వేరుగా ఉంటే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని నారాయణ పేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పి.ఇ.టి బి. గోపాలం ఆందోళన వ్యక్తం చేశారు. పైచదువులు, ఉద్యోగాలు, ముఖ్యంగా క్రీడా రంగంలో రిజిస్ట్రేషన్ల సమయంలో ఈ తేడాల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. 2015లో తాను రిటైర్ అయిన తర్వాత జిల్లా నుంచి ఎంతోమందిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు తీసుకెళ్లినప్పుడు ఇలాంటి సమస్యల వల్ల క్రీడా కారులు అన్యాయానికి గురైనట్లు ఆయన గుర్తుచేశారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, హెచ్ఎంలపై ఉందన్నారు. పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు పెట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వ పరంగా న్యాయం చేయడానికి ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక క్యాంపులు లేదా మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసి డేట్ ఆఫ్ బర్త్ తప్పులను సరిదిద్దాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల భవిష్యత్తు కోసం ఈ చిన్న తప్పులను సరిదిద్దించుకోవాలని ఆయన కోరారు.

## కల్వకుర్తిలో ఘనంగా దుర్గాభవాని లడ్డూ వేలంపాట







**కల్వకుర్తి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** కల్వకుర్తి మండల కేంద్రంలో జై భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాభవాని లడ్డూ వేలంపాట - 2026 ఘనంగా జరిగింది. దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి లడ్డూ ప్రసాదం వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని లడ్డూలను దక్కించుకున్నారు.

**వేలం వివరాలు...**

5 కేజీ లడ్డూ రూ. 52,001/ బెల్లంపురం నర్సీములు

2 కేజీల లడ్డూ రూ. 60,001/ పెమాండ్ల నారాయణ

2కేజీల లడ్డూ (లక్కీ డ్రా) మాస ఘన రామచంద్ర గౌడ్ తండ్రి రాహుల్ గౌడ్

సెపు - రూ. 8,100/ సంబు సాయిలు

సెపు - రూ. 6,001/ వాకలి సాయిలు

సెపు - రూ. 4,001/ కిష్టాపురం శ్రీరాములు

అత్యధిక ధర పలికిన లడ్డూలను నిర్వాహకులు భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొని విజయవంతం చేసిన భక్తులకు, దాతలకు జై భవాని యూత్ మండలి సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భవాని యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## బాలకుడు బలే బలే

- రావణ దహనం చేసిన చిన్నారులు



**శివ్వంపేట, అక్టోబర్ 21 (జనంసాక్షి):** మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామం, శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన రాజిపేట ఆదిత్య విద్యాభ్యాసం కొడిపల్లి మండలం తునికి గ్రామంలోని ప్రభుత్వ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బీసీ విద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్నాడు. దసరా వేడుకల్లో భాగంగా గత మూడు సంవత్సరాలుగా భారీ రావణున్ని తయారు చేసి రావణ దహనాన్ని తోటి మిత్రులతో ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా రావణ దహన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, కాలనీ వాసులు ఆసక్తిగా తిలకించారు. రాజిపేట ఆదిత్య ఐదవ తరగతి నుంచి రావణ బొమ్మలను తయారు చేసి శ్రీరామ్ నగర్ కాలనీలో రావణ దహనం చేస్తుండటంతో చిన్నతనం లో మంచి అలవాట్ల పట్ల గ్రామస్తులు అచ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు ప్రతిభ కనబరిచిన ఆదిత్యను ప్రత్యేకంగా అభినందించారు. నేటియుగం లో ప్రాచీన కలలు కనుమరుగైపోతున్న తరుణంలో,నేటి ఆధునిక సమాజంలో హిందూ సాంప్రదాయాలు, ఆచార్య వ్యవహారాలు పట్ల పిల్లలకు అవగాహన లేకపోవడం వంటి విషయాల్లో రాజిపేట ఆదిత్య హిందూ సాంప్రదాయాలకు పూర్వ వైభవం తెచ్చే దిశగా అడుగులు వేస్తున్నాడు.

రావణుని తయారికి ఇంట్లో దొరికే వృథా వస్తువులను ఉపయోగించి తయారు చేశాడు. కట్టె ముక్కలు, అట్ట ముక్కలు, ఎండు గడ్డి అతి తక్కువ ఖర్చుతో చేసి అతి చిన్న వయసులోనే గ్రామ ప్రజల ఆదర అభిమానాలను పొందినాడు.

# సదాశివపేటలో ఘనంగా దసరా పండుగ వేడుకలు..





**సదాశివపేట, అక్టోబర్ 21(జనంసాక్షి):** విజయదశమి పర్వదిన సంబరాలు సదాశివపేటలో అంబరాన్నంటాయి. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం శ్రీరామ కళామందిరం నుంచి ఉత్సవ దేవతామూర్తులతో దుర్గమ్మ గుడి వరకు రథోత్సవం నిర్వహించారు. శ్రీరామ కళామందిరం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధుల మీదగా దుర్గమ్మ ఆలయం వరకు రథోత్సవం సాగింది.

అక్కడ ఆలయ ఆవరణలోని జంబి వృక్షానికి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి ఇచ్చుకుంటూ అలాయి భలే తీసుకున్నాను. ఆలయం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దసరా ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి లు మాట్లాడుతూ దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. దసరా పండుగ ఏర్పాట్లను టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డిల సహకారంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. దుర్గమ్మ గుడి ఆవరణలో రావణవధ నిర్వహించగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.



## భూనీడులో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఘన సన్మానం

- సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు సాధించిన రాఘవేందర్ గౌడ్, కీర్తనకు అభినందనలు





**కొత్తపల్లి, అక్టోబర్ 21(జనంసాక్షి):** బూనేడు గ్రామానికి చెందిన కృష్ణయ్య గౌడ్ కుమారుడు రాఘవేందర్ గౌడ్, కిషన్‌నగర్‌కు చెందిన స్వర్గీయ జైపాల్ రెడ్డి కుమార్తె కీర్తన సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూనీడు ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి కీర్తనను, రాఘవేందర్ గౌడ్ ను శాలువాతో సత్కరించి అభినందించారు. వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదిగి పేద ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో భూనీడు సర్పంచ్ సవారి పుష్ప శ్రీనివాస్, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, కిషన్‌నగర్ ఉపసర్పంచ్ అక్షయ్, వార్డు సభ్యుడు నరహరి, పురుషోత్తం, సాయిలు, అంజిరెడ్డి, బాలు, కార్తీక్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా కానుకగా... వయోవృద్ధులకు అండగా నిలిచిన సర్పంచ్ శిరీష

- వృద్ధులకు చేతికర్రలు పంపిణీ



**మల్దకల్, అక్టోబర్ 21(జనంసాక్షి):** మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం వయోవృద్ధులకు దసరా కానుకగా చేతికర్రలను సర్పంచ్ అల్వాల శిరీష రాజ శేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వృద్ధులకు,పెద్దలకు భరోసా ప్రజాసేవ పనిచేయడమే లక్ష్యమని, వృద్ధులు నడిచేటప్పుడు ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో ఈ చిన్న కానుక అందించడం పెద్దలను గౌరవించడం, వారికి అండగా నిలవడం మనందరి బాధ్యత అని సర్పంచ్ అన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి నర్సిములు, వార్డు సభ్యులు పరశురాముడు, కిష్టన్న, వెంకటేష్, సవారి, శివ, గ్రామస్తులు శివన్న, బి.కృష్ణ, శీను,ఉలువ నరసింహ, కే. నరసింహ, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన ఊరేగింపు

- మిడ్జిల్, వాడ్యాల, మసి గుండ్లపల్లి, తదితర గ్రామంలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలకు ముగింపు



**మిడ్జిల్, అక్టోబర్ 21(జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దుర్గామాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాన్ని ఈదమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తితో పూజలు నిర్వహించారు. గ్రామ వీధులన్నీ పండుగ శోభను సంతరించుకోగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఈదమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు, ఉత్సవాల విజయవంతానికి సహకరించిన కమిటీ సభ్యులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతను చాటిచెప్పేలా శరన్నవరాత్రి వేడుకలు ముగిశాయి.





## సామాన్య రైతు బిడ్డకు సముచిత ప్రాధాన్యం!

- సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా చల్లారం మల్లారెడ్డి



**నంగునూరు, అక్టోబరు 21(జనంసాక్షి):** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయిపల్లిలోని సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన చల్లారం మల్లారెడ్డికి రాజకీయంగా కీలక బాధ్యతలు దక్కాయి. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఆయనను నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. తిమ్మాయిపల్లికి చెందిన చల్లారం మల్లారెడ్డి సామాన్య రైతు. తనకు ఉన్న వ్యవసాయ భూమిలో వివిధ పంటలతోపాటు కూరగాయలు సాగుచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సామాన్య కుటుంబ నేపథ్యం, సామాజిక చైతన్యం కలిగిన మల్లారెడ్డి వ్యవసాయం చేసుకుంటూనే కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేసిన వెంటనే కవితను కలిసి ఆ పార్టీలో చేరారు. అప్పటినుంచి తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. మల్లారెడ్డి అంకిత భావాన్ని గుర్తించిన కవిత తెలంగాణ రక్షణ సేన సిద్ధిపేట నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించారు. తనకు సముచిత ప్రాధాన్యత కల్పించి, కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు చల్లారం మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మల్లారెడ్డి తెలిపారు. ప్రజలకు చేరువగా ఉంటూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతానని వెల్లడించారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నాయకుడికి నియోజకవర్గ స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## క్రీడా పరికరాలకు ఘనంగా ఆయుధపూజ



**గోపాలపేట, అక్టోబర్ 21 (జనంసాక్షి):** పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ గోపాలపేటలో దసరా సందర్భంగా క్రీడా పరికరాలకు ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, అథ్లెటిక్స్ పరికరాలను అలంకరించి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జిల్లెల్ల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు కీలకమని, చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడా మైదానాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. సీనియర్ క్రీడాకారుడు రవి, ఫుట్‌బాల్ కోచ్ సందీప్ విద్యార్థులను ప్రోత్సహించారు. క్రమశిక్షణతో సాధన చేస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించింది.

## వనపర్తిలో సంప్రదాయబద్ధంగా జమ్మి ఉత్సవాలు



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** విజయదశమి సందర్భంగా వనపర్తిలో జమ్మి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని రాజావారి ఆస్థానంలో జరిగిన వేడుకల్లో రాజా కృష్ణదేవరావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. రాజవంశీయుల సంప్రదాయం ప్రకారం ప్రారంభమైన ఊరేగింపు నల్లచెరువు కట్టపై ఉన్న జమ్మి వృక్షం వద్దకు చేరుకుంది. అక్కడ రాజా కృష్ణదేవరావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి ఆకులను బంగారంగా భావించి పరస్పరం అందజేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జమ్మి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవీలత, ఎస్ఎల్ఎన్ రమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తా: బుచ్చిబాబు యాదవ్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 21 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కృషి చేస్తానని నూతన జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆవుల బుచ్చిబాబు యాదవ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రంజిత్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనపర్తి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

- వచ్చే ఏడాది ఆలయ 50వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం
- షమీ పూజలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి







**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన షమీ పూజ కార్యక్రమంలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన సతీమణి శారదా రెడ్డి, కుమారులు నవనీత్ రెడ్డి, మనోజ్ రెడ్డితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే కుటుంబానికి ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు స్వాగతం పలికారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన షమీ పూజలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** వనపర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకునేందుకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు.

వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 50వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం.. సేవా సంకల్ప్ అభియాన్‌లో క్రికెట్ సందడి

- పెబ్బేరు జట్టుకు విజయం.. రేపు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు





**వనపర్తి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొంటున్నాయి.

టోర్నమెంట్‌లో భాగంగా నాలుగో రోజు నాగవరం, పెబ్బేరు జట్ల మధ్య లీగ్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షురాలు అనుజ్ఞా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్నగారి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం మ్యాచ్‌ను వీక్షించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ పోటీలో పెబ్బేరు జట్టు విజయం సాధించడంతో ఆ జట్టు క్రీడాకారులకు బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణా లను అలవర్చుతాయని పేర్కొన్నారు. యువతకు క్రీడా అవకాశాలు కల్పించే ఇలాంటి టోర్నమెంట్ల నిర్వహణ అభినందనీయమని తెలిపారు.

**రేపు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు...**

టోర్నమెంట్‌లో భాగంగా రేపు సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. క్రీడాభిమానులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌లను వీక్షించాలని కోరారు.

## అంబరన్నంటిన దసరా పండుగ వేడుకలు

- శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు



**నారాయణపేట, అక్టోబర్ 21(జనంసాక్షి):** మండలం, సింగారం గ్రామంలో మంగళవారం చెడుపై విజయం సాధించిన విజయదశమి (దసరా) వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో పండుగలో అతి పెద్ద పండుగనై దసరా పండుగను పురస్కరించుకొని సాయంత్రం స్థానిక అంజనేయ స్వామి ఆలయం నుంచి చింతలరాయ స్వామి ఆలయం వరకు మేళాతాళలతో ఊరేగింపుగా బయలుదేరి అక్కడ శమీ (జమ్మిచెట్టుకు) వృక్షానికి గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు శమీ వృక్షానికి ప్రదక్షిణాలు చేసి జమ్మి ఆకును బంగారంలా భావించి ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు పెద్దల ఆశీస్సులు పొందారు. అంతకు ముందు చింతలరాయ స్వామివారికి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని భవానీమాత ఆలయం, చౌడేశ్వరి మాత ఆలయం, దుర్గామాత మండపంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

## భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలు!

- ఆలయాల్లో భక్తుల సందడి..జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు





**మహమ్మదాబాద్,అక్టోబర్ 21 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల వ్యాప్తంగా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని,భక్తులు భక్తిశ్రద్ధలతో,అత్యంత వైభవంగా జరుపుకున్నారు.దసరా నవరాత్రుల ముగింపు సందర్భంగా గ్రామగ్రామాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.పండుగ వేళ ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా,గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.చిన్నాపెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని, భక్తిపారవశ్యంలో అమ్మవారికి వీడ్కోలు పలికారు.విజయదశమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు,జమ్మిచెట్టు పూజలు నిర్వహించి.జమ్మి చెట్టు ఆకులు ఒకరికి ఒకరు. పెట్టుకుంటూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**యూత్ ప్రెసిడెంట్,కు ఘనసన్మానం...**

నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా,అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో యూత్ ప్రెసిడెంట్ జి.చంద్రయ్య,ను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం పండుగ వేడుకలుభక్తి,సంప్రదాయం,ఐకమత్యానికి ప్రతీకగా నిలిచాయి.గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ ఈ హనుమంత గౌడ్,ఆలయ చైర్మన్ అంజనా చారి,ఎం రాఘవేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ బి రామకృష్ణ,జి అంజలయ్య,కోట్ల రాములు,బచ్చనోళ్ళ కృష్ణయ్య,జి నరేష్,ఎన్ లక్ష్మీకాంత్,గాజుల శ్రీనివాసులు,గ్రామస్తులు భక్తులు,పాల్గొన్నారు.

## దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- కలెక్టరేట్ ముట్టడికి ప్రజా సంఘాల పిలుపు



**మనోహరాబాద్, అక్టోబర్ 23 (జనంసాక్షి):** మెదక్ జిల్లా తూప్రాన్–మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి (పి.టి.) గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడికి పాల్పడిన సర్పంచ్ మన్నె కళ్యాణ్, అతని అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. దాడి జరిగి మూడు రోజులు గడిచినా నిందితులపై చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

బుధవారం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి. శంకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ. మహేందర్‌రెడ్డి, బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూంపల్లి మధు, హైకోర్టు న్యాయవాది దివాకర్ పూలే, బీసీ మేధావుల ఫోరం నాయకులు పాపని నాగరాజు గౌడ్, అనంత్, జర్నలిస్ట్ నగేష్, బీఎస్పీ నాయకుడు చంద్రం తదితరులతో కూడిన బృందం గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దళితులు బతుకమ్మ ఉత్సవాల్లో డప్పులు కొడుతున్న సమయంలో ప్రశ్నించినందుకు సర్పంచ్, అతని అనుచరులు లాఠీలతో దాడి చేశారని ఆరోపించారు. కులం పేరుతో దూషిస్తూ మహిళలపై కూడా దాడికి పాల్పడ్డారని, అనేక మంది గాయపడ్డారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయాల్సిన పోలీసులు నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

దళితులపై దాడి జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, నిందితులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు గ్రామపంచాయతీ కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దళితులపై దాడికి నిరసనగా అక్టోబర్ 22న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు ప్రకటించారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు విరమించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొనాయిపల్లి దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ దళితులు నర్సిములు, ప్రవీణ్, నిరంజన్ దాసు, గురుదాసు, రేణుక, శ్రావణి, ప్రమీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

## అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి









**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** ప్రజల ప్రాణాలు, ఆస్తులు, గౌరవాన్ని కాపాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి. సునీతా రెడ్డి అన్నారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం వనపర్తి జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అమరవీరుల స్మారక స్థూపానికి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

**ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ...** పోలీసులు కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజలకు భరోసా కల్పిస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

**కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...** అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. యువత వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకొని దేశసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ...** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ వద్ద ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏదుల గ్రామంలో సర్పంచ్‌కు అవమానం

**అగ్రవర్ణ ఆధిపత్యంపై బీసీ సంఘాల ఆగ్రహం**

**స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సర్పంచ్ పరశురాం యాదవ్**



**రేవల్లి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** ఏదుల గ్రామంలో దసరా పండుగ సందర్భంగా సర్పంచ్ కాటమోని పరుశురాం యాదవ్‌కు జరిగిన అవమానంపై గ్రామంలో తీవ్ర దుమారం రేగుతోంది. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా కొంతమంది నాయకులు జమ్మి చెట్టు వద్ద శమీ పూజ నిర్వహించడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

**అసలేం జరిగింది?**

మంగళవారం విజయదశమి సందర్భంగా ఏదుల గ్రామంలో అధికారికంగా సర్పంచ్ ఆధ్వర్యంలో జరగాల్సిన శమీ పూజకు, సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వలేదని, కొంతమంది అగ్రవర్ణ భావజాలం కలిగిన నాయకులు ముందుగానే సొంతంగా పూజ చేసుకుని వెళ్లారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**బీసీ బిడ్డ సర్పంచ్ కావడం జీర్ణించుకోలేకపోవడమే కారణం:**

ఒక బీసీ బిడ్డ సర్పంచ్ కావడాన్ని జీర్ణించుకోలేని కొందరి కుల అహంకారానికి ఇది నిదర్శనమని, ఇలాంటి చర్యలు గ్రామ ఐక్యతకు గొడ్డలిపెట్టు లాంటివని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఘటనపై ఎంపీడీఓ, డీఎల్పీఓ లు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గ్రామ సర్పంచ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఇది కేవలం పరుశురాం యాదవ్‌కు జరిగిన అవమానం కాదని, ఏదుల గ్రామ ప్రజలందరికీ జరిగిన అవమానమని గ్రామస్తులు పేర్కొన్నారు.

# విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 154 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. నారాయణపేట జిల్లాలో 2005లో విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టేబుల్ రాజారెడ్డి త్యాగాన్ని స్మరించుకున్నారు. అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సావర్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా మీదుగా పోలీసులు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చేర్యాల ప్రాంతంలో ఇష్టానుసారంగా వడ్డీ వ్యాపారం

**వడ్డీ వ్యాపారుల చేతిలో సర్వం కోల్పోతున్న పేద ప్రజలు**

**చేర్యాల (జనంసాక్షి) అక్టోబర్ 21:** పేదప్రజల అవసరాలను ఆసరగా చేసుకొని కొందరు చేర్యాల పట్టణంలో అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా అక్రమంగా నూటికి పది రూపాయల చొప్పున వసూళ్లు చేస్తూ పేదప్రజల కష్టాన్ని అప్పనంగా దోచుకుంటున్నారు. అప్పు ఇవ్వాలి అంటే భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ద్విచక్ర వాహనాలు,బంగారం తాకట్టు పెట్టుకుంటు అక్రమ వడ్డీ, చక్రవడ్డీలతో బాధితులను వేధిస్తున్న ఘటనలు చేర్యాలలో జరుగుతున్నాయి. ఇదే అధిక వడ్డీల విషయంలో కొద్ది రోజుల క్రితం చేర్యాల పాత బస్టాండ్ వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడి పోలీసు స్టేషన్ వరకు వెళ్లారు. మండల వ్యాప్తంగా అవసరాలకు అప్పులు తీసుకొని అధిక వడ్డీలు చెల్లించలేక భూములు కోల్పోతున్నారు చాలా మంది ఉన్నారు. బయటకి చెబితే ఎక్కడ పరువుపోతుందో అని భయపడుతు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మాలి గారి భూమయ్య డిమాండ్ చేస్తూ వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకొనుటకు సిద్దిపేట జిల్లా సిపి కి రిపోర్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఎవరైనా వడ్డీ వ్యాపారులతో ఇబ్బందులు ఎదురైతే 9640561650 నెంబర్ కు సంప్రదించాలని చేర్యాల ప్రాంతంలో ఎంతమంది బాధితులు ఉన్నారో మీరిచ్చిన వివరాలతో సీపీ కి ఫిర్యాదు చేస్తాం అని తెలిపారు.

# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబరాన్నంటిన దసరా సంబురాలు



**సంగారెడ్డి, అక్టోబర్ 21 (జనంసాక్షి):** సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. జగ్గారెడ్డి భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి భజనల్లో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను ఊరేగింపుగా అంబేద్కర్ స్టేడియానికి తీసుకువచ్చారు. స్టేడియంలో మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం రావణ దహనం చేపట్టారు. భారీగా తరలివచ్చిన ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. బాణసంచా వెలుగులు, డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ప్రముఖ సినీ నేపథ్య గాయకుల సంగీత విభావరి అలరించింది.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సంగారెడ్డి ప్రజలే తనను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చారని అన్నారు. నలభై ఏళ్ల క్రితం ఇదే మైదానంలో స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి పట్టణంతో తన అనుబంధం కొనసాగుతోందన్నారు.

ప్రతి ఏటా తన సంపాదనలో కొంత భాగాన్ని ప్రజల కోసం పండుగల నిర్వహణకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. దసరా వేదికను ఎప్పుడూ రాజకీయాల కోసం ఉపయోగించలేదని, ప్రజలతో తన మనసులోని మాటలను పంచుకునేందుకే ఈ వేదికను





వినియోగిస్తున్నానని చెప్పారు. సంగారెడ్డి ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని పేర్కొన్నారు.

కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై పిల్లలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడేవారు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు. తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కుటుంబ బంధాలు, ప్రేమానురాగాలను పెంపొందించుకోవడమే పండుగల అసలైన ఉద్దేశమని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నిర్మలా జగ్గారెడ్డి, జయా రెడ్డి, భరత్ సాయి రెడ్డి, తోపాజి అనంత కిషన్, శ్రీహరి, కూన వనిత సంతోష్, కిరణ్ గౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగవరంలో ఘనంగా

# నాగవరం ప్రీమియర్ లీగ్ సీజన్-3

**విజేతగా నిలిచిన స్కై 11 జట్టు.. ట్రోఫీ, నగదు బహుమతి అందజేత**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 21 (జనంసాక్షి):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగవరంలో నాగవరం ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) సీజన్--3 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ పోటీల్లో స్కై 11 జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది.టోర్నమెంట్ విజేతలకు అందజేసే ట్రోఫీతో పాటు నగదు బహుమతిని నీరజ్ ముదిరాజ్ స్పాన్సర్ చేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ జర్నలిస్ట్ బాలస్వామి మల్యాల విజేతలకు ట్రోఫీ, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందించడంతో పాటు రన్నరప్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ట్రోఫీ స్పాన్సర్ నీరజ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని అన్నారు. క్రికెట్‌లో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు.క్రీడాకారులు ఐక్యంగా ఉంటూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్ స్థానిక యువతలో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో నీరజ్ ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, గోపాల్, టోర్నమెంట్ నిర్వాహకులు యాదగిరి, శ్రీకాంత్, రాఘవేందర్, శేఖర్, అభిలాష్, భాస్కర్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.